# సిగిటి సుబ్బారావు

అరిగే రామారావు

జానకి ఇంట్లోంచి వీధి గుమ్మంలోకి వచ్చి రోడ్డు చివరికంటా దృష్టి సారించి చూచింది. రోడ్డు మీద వాళ్లూ వీళ్ళూ వస్తూ పోతున్నారుగాని, అసలయినాయన రావడం లేదు.

ఆ ఆయన జానకి 'ఆయన'! పేరు సుబ్బారావు. వృత్తి గుమస్తాగిరీ. జీతం ఆరొందలు. చేసేది గుమస్తాగిరి అయినా, మా ఆయన పద్నాల్గు అంతస్తుల బిల్డింగ్‌లో ఆరవ అంతస్థులో పనిచేస్తోన్నాడని జానక్కి కాస్త గర్వం. ఏ ఇరిగింటమ్మతోనో, పొరిగింటమ్మతోనో ఏ మార్నింగ్ షోకో, మరే బట్టలషాపుకో మౌంట్ రోడ్డు కేసి వెళ్ళిందంటే చాలు వాళ్ళను రోడ్డు మీద నిలబెట్టేసి, 'ఇదిగో ఇదే మావారి ఆఫీసు. అదిగో ఆ ఆరవ అంతస్థులోనే వుంటారు!' అని గర్వంగా చెప్తుతుంది.

బయటివాళ్ళదగ్గర ఆయన్ని గురించి గర్వంగా చెప్తుతుందిగాని, నిజానికి ఆయనంటె తనకి తెగకోపం! ప్రస్తుతానికి మరీకోపంగా వుంది ఇంత లేటుగానా ఆఫీసునుంచి రావటం! అందులో ఇవాళ జీతాలరోజాయె.

ఇందాకట్నుంచీ మాటిమాటికీ ఇంట్లోంచి వీధి గుమ్మంలోకి, వీధిగుమ్మంలోంచి ఇంట్లోకి తెగ తిరుగుతూంది–ఆయన కోసం ఎదురు చూస్తూ.

గుమ్మంలోకి వచ్చినప్పుడు రోడ్డువంక చూస్తూంది! ఇంట్లోకి వెళ్ళినప్పుడు అద్దంలో చూసుకుంటూంది, కొప్పు, కొప్పులోపువ్వులూ, ముందుకుబడ్డ ముంగుర్లూ సవరించుకుంటూంది. కట్టుకున్న కొత్త ఆర్గండీ చీర కుచ్చిళ్ళూ, పమిటా సరిచేసుకుంటూంది.

భర్త ఇంటికి రాగానే తను కట్టిన కొత్త చీరను చూచి దంగైపోవాలి. ఎక్కడిదీ! ఎప్పుడు కొన్నావు. డబ్బులెక్కడివి — అని ప్రశ్నల వర్షం కురిపించాలి. తను గర్వంగా నవ్వాలి. అప్పుడు తను భర్తను వూరిస్తూ. వుడికిస్తూ జరిగింది చెప్పాలి. అంతా విని ఆయన 'పిచ్చిబాబు' మొగం పెట్టాలి. అది చూచి తను నవ్వుకోవాలి!.... లేకపోతే, 'ఏవండీ, ఏవండీ శ్రావణ మాసమండీ! రాకరాక సంవత్సరానికొక్కసారి వస్తుందండీ–ఒక్కటంటే ఒక్క చీర కొనండీ. శ్రావణ శుక్రవారం నాడు పూజ చేసుకొనికట్టుకుంటానండీ! పోయినేడు, ఆ పోయినేడు కూడ కట్టుకోలేదండీ!' అని మూణ్ణెళ్ళ ముందునుంచే చెవున ఇల్లు కట్టుకొని పోరుతూంటెవింటేనా?

'అన్నీ చూస్తూ నీవూ అలా అంటె ఎలా జానకీ!' అంటూ వేధవసిన్మా డైలాగ్ ఒకటి వదిలేసి అక్కడితో తన పనైపోయినట్లు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటారు.


చూస్తానికేంవున్నాయి? ఆర్థిక ఇబ్బందులూ- ఇవి ఏనాడు లేవు గనుకా? ఈరోజు క్రొత్తగా వచ్చాయా? తను కాపురానికి వచ్చినప్పట్నుంచీ వున్నవే! ఈ ఇబ్బందులన్నీతీరి, తను క్రొత్త చీర కొనుక్కొని, శ్రావణ శుక్రవారప్పూజ చేసుకోవాలంటె తనప్పటికి ముసలమ్మయిపోయి కూర్చుంటుంది! ఏం కట్టుకున్నా, ఏం పెట్టుకున్నా, ఏ అచ్చటయినా ముచ్చటయినా ఈ వయసులోనే అనే విషయం ఈ మనిషికి తెలియదు. అదేం ఖర్మో!

ఆఖరికి ఇవ్వాళ్ళ ఉదయం కూడ, "ఇవ్వాళ్ళే ఆఖరి శుక్రవారమండి. మీకు ఇవ్వాళ జీతాలు కూడా ఇస్తారు. పెద్దాడ్ని మీ ఆఫీసుకు పంపిస్తా డబ్బులిచ్చి పంపండి–ఎంచక్కా క్రొత్తచీర కొనుక్కొని పూజలో పెట్టి కటుకుంటాను!" అని వెంటబడి ప్రాధేయబడి అడిగింది.

'హూం!' అని ఘీంకరించి చిందులు తొక్కుతూ ఆఫీసుకెళ్ళిపోయారు. తనెంత చిన్నబుచ్చుకుంది!" ఆయన కొనకపోతే తనిక కొనుక్కోలేదా, కట్టుకోలేదా?

ఇంతకీ తనకివ్వాళ్ళ క్రొత్తచీర కట్టే యోగం వుంది. అందుకే ఆ కనక దుర్గమ్మ తల్లి ఇలా కటాక్షించింది. ఎవరి అదృష్టాన్ని ఎవరు చెరుపుతరు? ఎవరు కట్టే చీరను ఎవరు కటుతారు? ప్రక్కింటి పిన్నిగారన్నట్లు క్రొత్త చీరలు మిలులో తయారుకాగానే నిన్ను ఫలానా

> గుమ్మంలోకి వచ్చినప్పుడు రోడువంక చూస్తూంది, ఇంట్లోకి వెళ్ళివప్పుడు అద్దంలో చూసుకుంటూంది, కొప్పులో పువ్వులూ, ముందుకుబడ్డ ముంగుర్లూ సవరించుకుంటూంది కట్టుకున్న కొత్త ఆర్గండీ చీర కుచ్చిళ్ళూ, పమిట సరిచేసుకుంటూంది తననుచూసి భర్త దంగైపోవాలి



జానకి కట్టుతుంది. నిన్న ఫలానా సుందరి కట్టుతుంది. నిన్న ఫలానా హైమావతి కట్టుతుంది అని వాటి వాటి మొగాన దేవుడు రాసేస్తాడు. లేకపోతే ఇవ్వాళ తనీ ఆర్గండిచీర కొంటాననుకుందా? కట్టుకొంటాననుకుందా?

....ఇలా అనుకుంటూ జానకి మళ్ళీ గుమ్మం దగ్గరకెళ్ళి చూసింది. వీధి మొగదల్లో సుబ్బారావు కనిపించాడు. 'అమ్మయ్య'! అనుకుంది.

గబగబా లోపలికి వచ్చి మళ్ళీ ఇంకోసారి అద్దంలో చూసుకుంది. అక్కడున్న చెక్క కుర్చీలో ఠీవిగా కూర్చుని, ఏదో పుస్తకం చేత్తో పట్టుకొని వూరికే పేజీలు త్రిప్పుతూ విలాసంగా కాళ్ళు వూపుతోంది. గుమ్మంలోంచే తననూ, తన కొత్త చీరను చూచి అయ్యగారు విస్తుపోవాలి అని ముసి ముసిగా నవ్వుకుంది.

వీధిలో సుబ్బారావు వీధిలోనే ఉండడుకదా! గడపలోకి. గడపలోంచి గదిలోకి వచ్చాడు. క్రొత్త ముస్తాబులో ఉన్న భార్య వంక ఆదోక మాదిరిగా చూశాడు.

భర్తను చూడగానే జానకి కుర్చీలోంచి లేచి నిలబడింది. సుబ్బారావు అందులో నీరసంగా కూలబడ్డాడు

అతగాడు చూడాలని కావాలని వంగోని చీరకుచ్చిళ్ళు సవరించుకుంది. పమిటను వూరికే అటూ ఇటూ త్రిప్పుకుంటూ కావాలని కూని రాగం తీసింది

అయినా భర్త చీరగురించి అడక్కపోయే సరికి కాస్త నిరుత్సాహపడింది 'ఏం మనిషో?' అని మనస్సులో అనుకుంటూ మంచినీళ్ళు తీసుకొని రావటానికి లోపలికెళ్ళింది.

మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ "చీరబావుందా" అంది.

సుబ్బారావు ఒక ప్రక్క నీళ్ళు త్రాగుతూనే బుర్ర వూగించాడు

"ఎక్కడిదని అడగవేం?" అంది నవ్వుతూ

"నీవే చెబుతావుగా!" పొడిగా అన్నాడు.

"వుహూం! కానాతనమే!" అని మూతిని మూడు వంకర్లు త్రిప్పి ఖాళీగ్లాసు తీసికొని మళ్ళీ లోపలికెళ్ళింది.

ఇందాక చేసిన రవ్వ కేసరిని ప్లేట్లో పెట్టుకొచ్చింది. ప్లేటందించబోతే "వద్దు జానకీ!" అన్నాడు డీలాగా.

"తినండి! చీర మీ డబ్బుల్తో ఏం కొన్లేదు లెండి. మొగం అలా పెట్టుకున్నారు" వెటకారంగా అంది.

విసుగ్గా "కాస్త టీ తగలేయి" అన్నాడు.

టీ తీసికొచ్చి ఇచ్చింది. ఇహ ఎలాగూ ఈయనగారు అడగడనుకుందేమో, ఇంకో కుర్చీని అతని ప్రక్కకు లాక్కొనికూర్చుంటూ మొదలెట్టింది. "ఇవాళ భలే గమ్మత్తు జరిగిందండీ! ప్రొద్దుట చీర కొనండీ అంటే తమరు చిందులు త్రొక్కుతూ ఆఫీసు కెళ్ళిపోయారుగా! నేను దిగాలుపడి కూర్చున్నా. పిల్లలు స్కూళ్ళకెళ్ళిపోయారు. ఇంతలో పక్కింటి

పిన్నిగారు వచ్చి, 'అమ్మాయి జానకీ! మా మనమరాళ్ళకు పరికిణీగుడలు కొనాలి మౌంట్ రోడ్డు కెళ్ళుదాం వస్తావా?' అని అడిగేరు. సాక్షాత్తూ మన బెజవాడ కనకదుర్గమ్మ తల్లే ఇలా పిన్నిగారి రూపంలో వచ్చి పిలిచి వుంటుందని ఇప్పుడనుకుంటున్నా! ఆమె అలా పిలిచిందా— ఇంట్లో వుండి చేసేదేముందని 'సరే' అని ఆమెకు తోడుగా వెళ్ళా. పిన్నిగారికి కావల్సిన బట్టలు కొని షాపులోంచి బయటికొచ్చేసరికి సిటీబస్సు అప్పుడే కదలబోతూంది. గబగబా బస్సెక్కబోతూ ఎందుకో క్రిందకు చూశా. సరిగ్గా నా కాళ్ళదగ్గర రోడ్డు మీద సరిక్రొత్తది వంద రూపాయిలు నోటు పడివుంది. వంగి ఇలా తీసుకున్నానో లేదో బస్సు అలా బయలుదేరింది. ఎవరిదో ఏంటో కనుక్కునే వ్యవధానం కూడా లేదు"

మధ్యలో అడ్డు తగిలి, "నీకు దొరికింది ఎక్కడా? మౌంట్ రోడ్డులోనేనా?" అన్నాడు ఆదుర్దాగా.

"అవును. మౌంట్ రోడ్డులోనే."

"ఎన్నింటికి? పదకొండు గంటలకా?" అదే ఆదుర్దా.

"అవును, పదకొండుగంటలకే! ఎందుకు, ఏంవయిందీ?" ఆశ్చర్యంగా అంది.

"ఏది ఆ వంద రూపాయలు నోటుందా?" ఆశగా అడిగాడు.

"లేదు" తాపీగా అంది.

"లేదా, ఏవంయిందీ?" రెట్టించి అడిగాడు.

కళ్ళెగరేస్తూ కుడిచేయి ముందుకు చాస్తూ, "చెప్పొచ్చేది అదే!" అంది. "పిన్నిగారు చూచి, చాల అదృష్టవంతురాలివి జానకీ! శ్రావణ శుక్రవారప్పూట వంద రూపాయల కాగితం నీ కాళ్ళదగ్గరికి ఎగురుకుంటూ వచ్చి పడింది. నేను చెప్పుతున్నా ఇహ మీ ఇంట్లో లక్ష్మి తాండవమాడుతుంది చూడు!' అన్నారు. దొరికిన డబ్బు వుంచుకోకూడదు. వెంటనే ఖర్చు చేసేయాలని సలహా కూడా ఇచ్చారు.

"ఆఁ ఎలాగూ శ్రావణ శుక్రవారానికి చీర కొనుక్కోవాలనుకున్నానుగా! మాంబళంలో బస్సు దిగి ఇదిగో ఈ చీర కొనేశాను" అంది సంబరపడిపోతూ.

"అందులో ఏవన్నా మిగిలిందా? మొత్తం ఖర్చు చేసేశావా?" ముంచుకొస్తున్న కోపాన్ని దిగమ్రింగుతూ అన్నాడు.

"ఆహా, ఇంకా అది చాలక పిన్నిగారిదగర పాతిక రూపాయలు అప్పుకూడా చేశా! ఆమె డబ్బు సాయంత్రం తిర్గి యిచ్చేస్తానని చెప్పాను. ఇచ్చేయండీ! అబ్బ. ఎందుకండి అంత మింగేసేటటు చూస్తారు? సరే చీరతో పాటు జాకిట్ గుడ్డా, పూలూ, పళ్ళూ కొనుక్కొచ్చి కాస్త ఆలస్యమైనా మొత్తానికి శ్రావణ శుక్రవారప్పూజ చేసుకున్నా!" కాస్త మురిపెంగా మరి కాస్త గర్వంగా అంది.

"ఏవిటీ ఆ వంద కాక పైన పాతికరూపాయలు అప్పుకూడా చేశావా?" ఇంటికప్పు ఎగిరిపోయేటట్లు అరిచాడు.

"ఎందుకండీ అలా అరుస్తారు? ఇప్పుడేవయిందీ! ఖర్చు చేసింది మీ డబ్బేం కాదుగా, దొరికిందేగా?" అంది.

"నీకు దొరికింది నా డబ్బేనే పాపిష్టిదానా! ఇవ్వాళ జీతం తీసుకొని చచ్చాగా! వాడన్నీ కొత్తనోట్లు ఇచ్చాడు. అవి మంచివో కాదో చూదామని పైన కిటికీ దగ్గరకు చచ్చా! ఇంతలో వుప్పెన గాలొచ్చి చేతిలోని నోట్లన్నీ వూడ్చుకు పెట్టుకుపోయిందే ముదనష్టపుదానా? నెల్లాళ్ళ కష్టార్జితమంతా రోడ్డు పాలయిపోయిందే జ్యేష్టముండా!" అంటూ గొంతు చించుకుంటూ కేక వేశాడు.

పట్టరాని దుఃఖం, వుక్రోషం, తన చేతకాని తనం మీద తనకే కోపం, భార్యమీద కడుపు మంటా, అందరిలో నవ్వులపాలయిపోయాననే వ్యథా, 'ఈనెల ఎలా?' అనే దిగులూ ఇవన్నీ ఆ కేకల రూపంలో బయటికివచ్చాయి.

జానకి పాపం బిక్కచచ్చిపోయింది. 'ఆ సంగతి నాకేం తెల్సిండీ!" అంది మెల్లగా.

"అవును నీకేం తెలుస్తుంది? ఎంత సేపూ నీ చీరెలూ. నీ షోకులూ. నీ పూజలే నీకు తెలుస్తాయి చీకో చీరో అని ఒకటే ఏడ్పు. నీ ఏడ్పేకొట్టింది. నెల పొడుగూత ఏం తింటానో తినండి. వంద రూపాయలు దొరగ్గానే ఖర్చు చేసెయ్యాలా? కనీసం ఆ వందయినా వుండేది కదా! ఇంతలోకే తగుదునమ్మా అంటూ చీర కొనేసి నా చీర చూడూ. నా అందం చూడూ అంటూ తెగత్రిప్పుకుంటున్నావ్? పటలేని కోపంతో పూనకం వచ్చిన వాడులాగా తెగ వూగిపోతున్నాడు

"అసలు నిన్నేం చెయ్యాలి? నిన్నూ.... నిన్నూ" అంటూ భార్య కొప్పు పట్టుకొని వంగదీసి వీపుమీద ధబీధబీమని గుద్దసాగాడు.

అంతకంటె ఏం చేస్తాడు ఈ 'సగటు సుబ్బారావు'?

[1-5-81 'హిందూ' దినపత్రికలో 'గాన్ విత్ ది విండ్' అనే కేప్షన్‌తో వచ్చిన 'న్యూస్ ఐటం' చదివేక]

❋

# Gone with the wind

MADRAS, April 30

A shower of currency notes from the 14-storeyed LIC building on Anna Salai caused a traffic jam this morning as passers-by tumbled over each other to grab what they could.

It happened around 11 a.m. when an LIC employee was counting his salary on the sixth floor. As he was suffering from 'Madras eye' and needed the extra sunlight to count the money, he stood near a window.

A sudden gust of wind pushed out the currency notes from his hand and sent them down through the window. The floating notes attracted passers-by who sprinted after them.

Vehicular traffic came to a halt. Eye witnesses said people waiting to see a morning show at a nearby cinema left the queue and rushed towards the falling notes, some of which flew as far as the Indian Overseas Bank building.

The hapless employee, meanwhile, raced down the staircase. All that he could retrieve out of the Rs. 506 he had in the pay packet was a single ten-rupee note — stuck on a windowsill high above one's reach.

---

ఇదీవరస —శాస్త్రి

